ప్రజాశక్తి

శుక్రవారం 10 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పట్టభద్రుల పోరు

- ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఈ నెల 16న నోటిఫికేషన్
- 23న నామినేషన్లు ప్రారంభం 24న స్క్రూటినీ
- నామినేషన్ల ఉపసంహరణ గడువు 27
- మార్చి 13న పోలింగ్, 16న కౌంటింగ్
- బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు
- పిడిఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ కె.రమాప్రభ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరు ఉత్తరాంధ్రలో రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం వెల్లడించింది. దీంతో ఎన్నికల కోడ్ మూడు ఉమ్మడి జిల్లాల్లో గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు (పాడేరు డివిజన్), అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 16న దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుండగా 23న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. 24న నామినేషన్ల స్క్రూటినీ, 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. మార్చి 16న కౌంటింగ్ ఉంటుంది.



ప్రచారంలో నిమగ్నమైన ఆయా పార్టీల అభ్యర్థులు

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రధానమైన రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులను ఇప్పటికే ఆయా పార్టీలు ప్రకటించాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంల్లో విశాఖ జిల్లా నుంచే ప్రధానంగా అభ్యర్థులంతా బరిలో ఉండడం విశేషం. వైసిపి అభ్యర్థిగా ఎపి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, తెలుగుదేశం అభ్యర్థిగా డాక్టర్ వేపాడ చిరంజీవిరావు బరిలో ఉన్నారు. 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలోకి దిగారు. సిపిఎం ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తోంది. అధికార పార్టీ వైసిపి బలపరిచిన సీతంరాజు మిగతా 2లో..



మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు, కుమార్

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే ఏజెంట్‌గా వ్యవహరించొద్దు

బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహారావుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం హెచ్చరిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సొంత నిధులతో, పలువురి త్యాగాలతో, కార్మిక శక్తితో విస్తరించి లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి కట్టేబెట్టేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దారుణమైనదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు ఏజెంట్‌గా వ్యవహరించొద్దని బిజెపి ఎంపీ జివిఎల్.నరసింహా రావును హెచ్చరించారు. ఇప్పటికైనా ఆయన తీరు మార్చుకోవాలని అన్నారు. గురువారం ఉదయం మద్దిలపాలెంలోని సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లోకనాథం మాట్లాడారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రజల పట్ల జివిఎల్.నరసింహారావు అమితమైన ప్రేమ ఉన్నట్లుగా నటించడం సరికాదన్నారు. ప్లాంట్ నిర్వీర్యమే లక్ష్యంగా ఆయన పార్లమెంట్‌లో ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించడం కోసం ఏనాడూ ప్రయత్నం చేయలేదన్నారు. విశాఖకు మెట్రో రైలు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు, రైల్వేజోన్ నిధులు, ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ నిధులు వంటి అంశాలు అనేకం ఉన్నప్పటికీ జివిఎల్ ఏనాడూ ఆ దిశగా ప్రయత్నం చేయలేదన్నారు. బిజెపి స్థానిక నాయకులు, ఎమ్మెల్సీ మాధవ్‌తో సహా కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను మరింత బలపర్చే విధంగా, వాటిని అమలు చేసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కేవలం విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నష్టాల పేరు చెబుతున్నారని, నష్టాలకు కారణం సొంత గనులు కేటాయించకపోవడం అన్న విషయాన్ని విస్మరిస్తున్నారని తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్రం పెట్టుబడి కింద కేవలం రూ.5 వేలు కోట్లు పెడితే స్టీల్‌ప్లాంట్ ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లను కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించదన్న వాస్తవాన్ని దాచిపెడుతున్నారన్నారు. నేడు పాలకులు అదానీ సేవలో ఉండి మిగతా 2లో..

రాజధాని ముసుగులో భూ కబ్జాలు

మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి



ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజధాని ముసుగులో విశాఖలోని వేల కోట్ల విలువైన భూములను వైసిపి నేతలు కాజేస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి చక్రవర్తి అని విమర్శించారు. ఐటి సెజ్‌లో 97 ఎకరాలను జిఆర్‌పిఎల్ మిగతా 2లో..

లోపలి పేజీల్లో..

- కూలి కోసం వెళ్లి.. విగతజీవులై..
- 12న 'ఖగోళశాస్త్రం - మానవ వికాసంపై ప్రభావం' సదస్సు
- సమస్యలపై కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా
- కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 'బ్లాక్ డే'

రైల్వే డిఆర్ఎం విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి గురువారం విశాఖపట్నం పోర్టు రైల్వే సైడింగ్‌ను ఉన్నత స్థాయి అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఓడరేవులోని బొగ్గు అన్‌లోడింగ్ సైడింగ్, కోల్ లోడింగ్ పాయింట్, కవర్ షెడ్ ఇతర ముఖ్యమైన ప్రదేశాలను బృందం పరిశీలించింది. అనంతరం వైజాగ్ పోర్టు ఛైర్మన్ రామ్మోహనరావుతో డిఆర్ఎం సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రేక్ డిటెన్షన్, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, త్రూపుట్ మొదలైన సమస్యలను పరిష్కరించడానికి కలిసి పని చేస్తామని డిఆర్ఎం హామీ ఇచ్చారు. వ్యాపార కార్యకలాపాలను, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా సులభంగా వ్యాపారం చేయడానికి బృందం అనేక సూచనలు అందించింది. అంతేకాకుండా డిఆర్ఎం అనుప్ సత్పతి నేతృత్వంలోని రైల్వే అధికారుల హై పవర్ టీమ్ పోర్టు సౌకర్యాల కార్యాలయంలో నాల్కో అధికారులతో సమావేశం నిర్వహించింది.



తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే డిఆర్ఎం అనుప్ సత్పతి

మొదటి పేజీ తరువాయి..

పట్టభద్రుల పోరు

సుధాకర్ గెలుపు కోసం అన్ని శక్తులనూ ఒడ్డుతుండగా, తెలుగుదేశం పార్టీ బలపరిచిన డాక్టర్ చిరంజీవిరావు పేరును అత్యంత ఆలస్యంగా ఆ పార్టీ వెల్లడించింది. విద్యావేత్తగా ఆయనకు మంచి పేరు ఉంది. బిజెపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ బరిలో ఉన్నారు. ప్రధానంగా అధికార వైసిపి అభ్యర్థిత్వంపైనా, బిజెపి సిట్టింగ్‌పైనా సొంత పార్టీల్లోనే వ్యతిరేకత పలు తరగతుల నుంచి వ్యక్తమవుతోంది. మాధవ్ గెలిచి ఉత్తరాంధ్రకు ఏ విషయంలోనూ న్యాయం చేయలేకపోయారన్న విమర్శలు నేటికీ వినిపిస్తూనే ఉన్నాయి. సొంత పార్టీలోనూ ఇదే వ్యక్తమవుతోంది. అధికార వైసిపి అభ్యర్థి సుధాకర్ ఓటర్ల చేర్పింపు నుంచి ఇప్పటి వరకూ ప్రలోభాలతో గట్టెక్కే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ వినియోగించుకుని గట్టెక్కాలని చూస్తున్నారు. దొంగ ఓటర్లను చేర్పించి లబ్ధిపొందాలని చూస్తున్నారంటూ పలువురి నుంచి ఆరోపణలను తరచూ ఎదుర్కొంటున్నారు. పలువురు అభ్యర్థులు ఇలా ప్రచారంలో పెద్ద ఎత్తున తమ తమ శైలిలో ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేపట్టారు.

ఆకట్టుకుంటున్న పిడిఎఫ్ అభ్యర్థి ప్రచార సరళి

ప్రోగ్రెసివ్ డెమొక్రటివ్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలన్నిట్లోనూ సామాజిక కార్యకర్తగా పేరొందారు. పలు కార్యక్రమాలతో 30 ఏళ్లుగా అన్ని తరగతుల దృష్టినీ ఆకర్షిస్తూ వస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో నిస్వార్థంగా, నిజాయితీగా, ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై కృషిచేస్తున్న తీరు, ఆమె సొంత కృషి ఈ ఎన్నికల్లో కలిసొచ్చే అంశంగా ఉంది. ఉత్తరాంధ్ర ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలపైనా, ఎపి విభజన తర్వాత ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపైనా ఆమె తరుచూ విశాఖ కేంద్రంగా తన గళాన్ని వినిపిస్తూ ఉండడం మరో ప్రత్యేకతగా ఉంది. రైల్వే జోన్ సాధన, పోలవరం, సుజల స్రవంతి రావాలని కోరుతూ పలు కార్యక్రమాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఆ తరగతులకు మద్దతుగా నిలిచిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధి కోసం ప్రజల గొంతుకను చట్టసభల్లో వినిపించేందుకు ఉత్తరాంధ్ర విద్యావంతుల వద్ద 2023 శాసన మండలి ఎన్నికల్లో తన అదృష్టాన్ని ఆమె పరీక్షించుకోబోతున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఓటర్లు, బూత్‌ల వివరాలు

మొత్తం పోలింగ్ బూత్‌లు : 293, ఓట్లు: 2,83,751
మహిళలు: 1,48,025, పురుషులు: 1,78,796, ట్రాన్స్‌జెండర్స్: 40

ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్

కలెక్టరేట్ : త్వరలో జరుగనున్న ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల అధికారి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే ఏజెంట్‌గా వ్యవహరించొద్దు

గంగవరం పోర్టుతో సహా రాష్ట్రంలో ఉండే అన్ని సహజ వనరులనూ అతనికే కట్టబెడుతున్నారని తెలిపారు. బుధవారం విశాఖలో జివిఎల్ ప్రెస్‌మీట్ పెట్టి స్టీల్‌ప్లాంట్ కోసం ప్రేమ చూపిస్తూనే.. హెచ్‌బి కాలనీలో ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి నష్టాలను పూడ్చుకోవాలని చెప్పడం సరైందికాదు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు కేవలం 6 వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందని ప్రశ్నించారు. జివిఎల్.నరసింహారావు ఉత్తరాంధ్రకు నష్టం చేకూర్చే ఏజెంటుగా వ్యవహరిస్తే విశాఖలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

రాజధాని ముసుగులో భూ కబ్జాలు

కంపెనీకి రూ.200 కోట్లకు అప్పనంగా అప్పగించారని, ఆ భూమి విలువ రూ.2 వేలా 500 కోట్లు ఉంటుందని తెలిపారు. అందులో బదిరి బాబు అనే మధ్యవర్తి ప్లాట్‌లు వేసి అమ్మకాలు చేస్తుంటే విజిలెన్స్, ఇంటెలిజెన్స్ కళ్లు మూసుకున్నాయా ? అని ప్రశ్నించారు. వీటిని ఎవరు కొనుక్కున్నా మోసపోతారని హెచ్చరించారు. నగరంలో అందరూ చూస్తుండగానే ఇంత దారుణం జరుగుతుంటే ఐఎఎస్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. వివాదాస్పద హయగ్రీవ ప్రాజెక్టు ఫైల్‌పై గత జివిఎంసి కమిషనర్ లక్ష్మీశ సంతకం పెట్టలేదని, అందుకనే అతనిని బదిలీ చేశారని అన్నారు.

కొండను తవ్వేసి నిర్మాణాలు జరుగుతున్నాయని, విల్లాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని నిర్మాణాలను ఆపాలని విజ్ఞప్తి చేశారు. అమరావతినే రాజధాని అని, మూడు రాజధానులు కాదని పార్లమెంటు సాక్షిగా బయటపడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రుషికొండను విధ్వంసం చేస్తూ మరోపక్క గ్రీన్‌మ్యాట్‌తో కప్పుతున్నారని, జి-20 సదస్సుకొచ్చే ప్రతినిధుల కంట పడకూడదని ఇలా చేస్తున్నారన్నారని, అందుకే జగన్‌ని తుగ్లక్ అని అంటారని విమర్శించారు.

12న 'ఖగోళశాస్త్రం - మానవ వికాసంపై ప్రభావం' సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఖగోళశాస్త్రం - మానవ వికాసంపై ప్రభావం అన్న అంశంపై ఈ నెల 12న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరగనుందని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ఎస్.శ్రీకాంత్ తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం కరాసలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి జరిగే సదస్సుకు జెవివి నాయకులు, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఈ సదస్సులో ప్రసంగించడానికి ఇస్రో బెంగళూరు నుంచి ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మూర్తి రెమెళ్ళ, ఐఐటి చెన్నై నుండి ప్రొఫెసర్ వి.శ్రీనివాస చక్రవర్తి, వరంగల్ నిట్ నుంచి ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య, ప్రముఖ హేతువాది పెనుమత్స సుబ్బరాజు పాల్గొని, సదస్సు సబ్జెక్టుపై ప్రజెంటేషన్స్ ఇస్తారన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొడానికి వందలాది మంది టీచర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, ఉద్యోగులు, టీచర్లు, విద్యార్థులు జెవివి ఇది వరకే ఇచ్చిన ఆన్‌లైన్ లింకులో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమం ఖగోళ శాస్త్రంలో, అలాగే అంతరిక్ష విజ్ఞానంలో రోజు రోజుకూ జరుగుతున్న అభివృద్ధిపై అవగాహన పెంచుకోవడానికి విద్యార్థులకు, టీచర్లకు ఒక మంచి అవకాశమని అన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పివి.గోపాలరావు, జిల్లా కోశాధికారి ఎస్‌వి.రమణ, నాయకులు సతీష్ రెడ్డి, ఇందూ శ్రీనివాసన్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి, దిగుమతులపై కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో సూర్యాబాగ్ టివిఎంసిఎ సమావేశ మందిరంలో ఎగుమతి, దిగుమతుల నిర్వహణపై ఐదు రోజుల సర్టిఫికెట్ కోర్సును గురువారం ప్రారంభించారు. ఎగుమతి, దిగుమతులకు భారత ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు చాలా ప్రశంసనీయంగా ఉన్నాయని ఫ్యాప్సీ ప్రెసిడెంట్ కరుణేంద్ర ఎస్.జాస్తి అన్నారు. అనంతరం ఎగుమతులకు సంబంధించిన కార్యక్రమాల సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఫ్యాప్సీ చేస్తున్న కృషిని ఇసిజిసి లిమిటెడ్ బ్రాంచ్ మేనేజర్ అమ్లెందు బిపుల్ మిశ్రా అభినందించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణపతి, సహాయ సంచాలకులు వరదా డివిఎస్ఆర్ కుమార్ పాల్గొన్నారు.



రైల్వే మంత్రితో కరచాలనం చేస్తున్న విశాఖ ఎంపీ ఎంవివి

రైల్వే మంత్రితో ఎంపీ ఎంవివి భేటీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఢిల్లీలోని రైల్ భవన్‌లో గురువారం భేటీ అయ్యారు. విశాఖపట్నం నుంచి తమిళనాడుకు వారాంతంగా నడిచే 12665/12666 హౌరా - కన్యాకుమారి, 12663/12664 హౌరా - తిరుచిరాపల్లి, 20896/20895 రైళ్లను ప్రతి రోజూ నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని, విశాఖపట్నం - ట్యూటికోరన్, విశాఖపట్నం - కన్యాకుమారి, విశాఖపట్నం - వేలంగిని మధ్య నూతన రైళ్లను ప్రారంభించాలని కోరారు. రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసి పనులు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

11 నుంచి మానవత - నైతికతపై ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత - నైతికత అనే కార్యక్రమాన్ని ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ విశాఖ జిల్లా నాయకులు జనాబ్ షేక్ మక్బూల్ తెలిపారు. గురువారం మహారాణిపేటలోని ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సాగుతుందన్నారు. ఇదొక జాగృతి ఉద్యమమని పేర్కొన్నారు. నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నాడని, కానీ మానవతా విలువలు నానాటికీ దిగజారుతున్నాయని తెలిపారు.

ముడసర్లోవ భూములను ప్రజావసరాలకు వినియోగించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ భూములను ప్రజావసరాలకు వినియోగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ముడసర్లోవలోని 283 ఎకరాల ప్రభుత్వ భూమిని పిపిపి పేరుతో ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడానికి జివిఎంసి కౌన్సిల్ తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆరిలోవలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహిస్తున్నారు. గురువారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి వార్డులో (11వ వార్డు)లో సిపిఎం నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ముడసర్లోవ భూముల ప్రయివేటీకరణ ఆపాలని, రిజర్వాయర్‌ను బోటు షికారుగా మార్చొద్దని, తాగు నీరు అందించే రిజర్వాయర్‌ను రక్షించుకుందామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ పాదయాత్రకు లోకనాథం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముడసర్లోవ భూములు ఎంతో విలువైనవన్నారు. ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు ఈ రిజర్వాయర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరిలోవ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి ఇక్కడ ఉన్న విలువైన భూములను ప్రయివేటు వారికి కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. మేయర్ పదవి ఇచ్చినందుకు కానుకగా ముడసర్లోవలో 283 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రయివేటు వారికి ఇస్తూ వైసిపి నాయకుడు విజయసాయిరెడ్డి రుణం తీర్చుకున్నారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలు అడిగితే నగరానికి దూరంగా కేటాయిస్తున్న ప్రభుత్వం.. ముడసర్లోవ భూములను మాత్రం అనయ్యాయంగా కట్టబెడుతోందన్నారు. ఈ భూముల రక్షణకు ప్రజలను, ప్రజాసంఘాలను, కలిసివచ్చే అందరికీ కలుపుకొని సిపిఎం పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.నరేంద్రకుమార్, వి.కృష్ణమూర్తి, ఎస్.రంగమ్మ, ఎ.రమణ, తులసీరావు, భూలోకరావు, లక్ష్మీనారాయణ, వై.అప్పారావు, నాగరాజు, కుమారి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రనుద్దేశించి మాట్లాడుతున్న లోకనాథం

నేరాలు ఘోరాలు

మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రమణయ్యపేట మాజీ సర్పంచ్ కె.అప్పారావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రమణయ్యపేట నుండి గురువారం ఆయన ద్విచక్ర వాహనంపై నక్కపల్లి వస్తుండగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన ద్విచక్ర వాహనం నుండి కింద పడగా చేతిపై నుంచి లారీ వెళ్లడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో స్థానిక సిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. హైవేపై నిర్వహణకు సంబంధించి పనులు చేస్తుండటంతో రోడ్డు ఇరు కుగా ఉండటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది .


ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్న మహిళతో శస్త్ర చికిత్స జరిపిన వైద్యులు

'అనిల్ నీరుకొండ'లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు గురువారం తెలిపాయి. ఒడిశా నబరంగాపూర్ ప్రాంతానికి చెందిన 59 ఏళ్ల మహిళ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. అప్పటికే ఆమె కడుపు ఉబ్బి ఉంది. ఇదే సమస్యతో సుమారు 5 ఏళ్లుగా బాధపడుతూ ఉంది. గైనకాలజీ విభాగం వైద్యులు జరిపిన వివిధ తనిఖీల్లో అండాశయం ద్వారా ఏర్పడిన పెద్ద కణితిగా గుర్తించారు. ఆసుపత్రి గైనకాలజి విభాగం వైద్యులు ఎన్ శ్రీవిద్య, డెమిసీ, పావని, శ్వేత, మౌనిక, శ్రావ్య శస్త్ర చికిత్స జరిపి 40×30×15 సెంటీమీటర్ల కణితిని తొలగించారు. డాక్టర్ దీపిక ఆధ్వర్యాన మత్తు వైద్యులు సేవలందించారు. కణితి బరువు సుమారు 24 కిలోలు ఉండగా దాని నుంచి 20 లీటర్ల నీరు తీశారు.

జాబ్ మేళాలో 48 మంది ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 48 మంది ఎంపికయ్యారు. వీరిలో 8 మంది స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హెటిరో డ్రగ్స్ కంపెనీకి ఎంపికయ్యారు. సుమారు 40 మంది విద్యార్థులు సినాప్టిక్స్ కంపెనీకి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వీరికి మార్చి 1న నియామకపత్రాలు అందజేయనున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, ఐక్యు కో-ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు, ప్లేస్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డి.మాధురి, వెంకటరావు, పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ల సత్కారం


జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని సత్కరిస్తున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జీవీఎంసీ 5, 7వ వార్డు టిడిపి కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్ళ మంగమ్మ గురువారం జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మిని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. 5, 7వార్డుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్థానిక సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. వార్డులలో తాగు నీటి సదుపాయం కల్పించాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని మెరుగుపరచాలని, అధ్వానంగా ఉన్న శ్మశాన వాటికలు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్ళ వెంకటరావు పాల్గొన్నారు.

కృష్ణ కిషోర్‌కు పరామర్శ

ప్రజాశక్తి -మధురవాడ : ఒక ప్రమాదంలో గాయపడిన జీవీఎంసీ 8వ వార్డు పరిధి సాగర్‌నగర్‌లోని భీమిలి డివిజన్‌కు చెందిన తెలుగు యువత ఉపాధ్యక్షుడు సాదినేని కృష్ణకిషోర్‌ను భీమిలి టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు గురువారం పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శెట్టిపల్లి గోపి, బోడేపూడి దొరబాబు, గోవిందరావు (చినగోపి), బోడెపూడి రాజాప్రతాప్, పచ్చల శరత్‌బాబు, ఉప్పలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ ఛాంపియన్ షిప్ పోటీలకు రమేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంతల రమేష్ ఈ నెల 12న బెంగళూర్‌లో జరుగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ -2023 పోటీలకు ఎంపికయ్యాడు. ఇతను ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌరీశంకర్ గురువారం తెలిపారు. ఎంపిక పోటీలు ఈ ఏడాది జనవరిలో ఎయులో నిర్వహించగా, రమేష్ మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రమేష్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాసాగర్, ఆర్ట్స్ హెచ్‌ఒడి ఉమామహేశ్వరరావు, ఐక్యు కో-ఆర్డినేటర్ ఎం.రాజేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ ఎం.రమణ, డాక్టర్ ఎ.ప్రసాద్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

నవోదయ దరఖాస్తులో సవరణకు అవకాశం

ప్రజాశక్తి -పిఎం పాలెం : కొమ్మాది సమీపంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకునే గడువు తేదీని ఫిబ్రవరి 15 వరకు మరోసారి పొడిగించినట్టు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు. నవోదయ వెబ్‌సైట్ www.nvs.gov.in ద్వారా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విద్యార్థుల కేటగిరీ, ప్రాంతం, మీడియం, అంగవైకల్యం వంటి విషయాలలో అవసరమైన సవరణలు చేసుకునేందుకు 16, 17 తేదీలలో వెబ్‌సైట్ లో అవకాశం ఉంటుందని తెలిపారు. తొమ్మిదో తరగతిలో మిగులు సీట్ల కోసం ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం ప్రవేశ పత్రాలు ఇప్పటికే నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో, చంద్రంపాలెం హైస్కూల్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

చినగదిలి రూరల్ తహశీల్దార్‌గా రమణయ్య

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి రూరల్ తహశీల్దార్‌గా పనసల రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన పాల్ కిరణ్ కలెక్టరేట్ ఎఒగా బదిలీపై వెళ్లారు.

ప్రముఖులతో గీతం సలహా సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం భవిష్య లక్ష్యాలను చేరుకోవడానికి, పరిశోధనలలో, విద్యావిషయక అంశాలలో మార్గదర్శకం చేయడానికి గీతం ఛాన్సలర్ డాక్టర్ వీరేంద్రసింగ్ చౌహాన్ అధ్యక్షతన సలహా సంఘం ఏర్పాటైంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరక్టర్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ పి.బలరామ్, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.శ్రీనాథరెడ్డి, ఐఐటి ముంబై మాజీ డైరక్టర్ ప్రొఫెసర్ అశోక్ మిశ్ర, కలకత్తా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, ప్రస్తుత జాదవపూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సురంజన్‌దాస్, మద్రాస్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.దురైస్వామి గీతం సలహా సంఘం సభ్యులుగా నియమితులయ్యారు. విశ్వవిద్యాలయం పరిపాలన, నూతన ఆవిష్కరణలు, పరిశోధన ప్రగతికి గీతం సలహా సంఘం కృషి చేయగలదనే గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ఆకాంక్షను వ్యక్తం చేశారు.


ప్రజా సంక్షేమమే లక్ష్యం : ముత్తంశెట్టి


ప్రజాశక్తి -యంత్రాంగం

పిఎం పాలెం : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. శిల్పారామంలో గురువారం గృహ సారథుల సమావేశం నిర్వహించారు. భీమిలి వైసిపి పర్యవేక్షకులు పసుపులేటి బాలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా, అర్హత కలిగిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అన్యాయం జరగకూడదనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని చెప్పారు. అర్హత ఉండి సంక్షేమానికి నోచుకోని వారందరినీ గుర్తించేందుకు వాలంటీర్లతో పాటు గృహ సారథులను కొత్తగా నియమించినట్లు తెలిపారు. వాలంటీర్లతో కలిసి పనిచేసి అప్పగించిన గృహాల్లో ఎవరికి ఏ పథకం వర్తిస్తుందో గుర్తించాలన్నారు. అనంతరం వాలంటీర్లకు, గృహ సారథులకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కిట్టు బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 5, 6, 7 వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు ఇఎన్ఎస్ చంద్రరరావు పోతిన మూర్తిబాబు, పిల్లా రమణబాబు, పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, వాండ్రాసి రవికుమార్, వాలంటీర్లు, గృహసారథులు, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచించారు. గురువారం స్థానిక ఎంసి కార్యాలయ ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హతను ప్రాతిపదికగా తీసుకుని నవరత్నాలు అందిస్తున్నట్లు వివరించారు. నియోజక వర్గ పార్టీ పరిశీలకులు పి.బాలరాజు, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు

సీతమ్మధార : సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రభుత్వానికి మంచి పేరుతో తెచ్చేలా పనిచేయాలని ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, మేయర్ హరి వెంకట్‌కుమారి సూచించారు. ఉత్తర నియోజకవర్గ పరిధి 26, 42, 43, 44వార్డులకు సంబంధించిన జెసిఎస్ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు షాదీఖాన మండపంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చిక్కాల రామారావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, నాయకులు పీలా వెంకటలక్ష్మి, బులుసు జగదీష్, మహ్మద్ ఫరూకి, పేడాడ రమణికుమారి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి


చెక్కును అందజేస్తున్న కోరమండల్ అధికారులు

కోరమండల్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ములగాడ : గ్రామాలాభివృద్ధికి కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎంతగానో తోడ్పడుతుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ అన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులను జీవీఎంసీ పరిధిలో గల 58వ వార్డు అభివృద్ధికి కేటాయించారు. కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఎదురువానిపాలెం గ్రామానికి రూ.18 లక్షలు, కుంచమ్మ కాలనీకి రూ.15 లక్షలు, గుల్లలపాలెంనకు రూ.17 లక్షలు కలిపి మొత్తం రూ.50 లక్షల చెక్కును జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, ములగాడ మండల రెవెన్యూ అధికారి వీరభద్రదరావు సమక్షంలో 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్యకు సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అందజేశారు. ఈ మేరకు కోరమండల్ అధికారులకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డు వైసిపి అధ్యక్షులు గులిగిందల కృష్ణ, కోరమండల్ అధికారులు జ్ఞానసుందర్, డివిఎస్.రాజా, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సిఎస్ఆర్ ప్రతినిధి అమృత తదితరులు పాల్గొన్నారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి జోగి రమేష్

వధూవరులకు మంత్రి జోగి రమేష్ ఆశీర్వాదం

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి నాయకులు ఏకుల వెంకటేష్ గౌడ్ తమ్ముడు ఏకుల సూర్యప్రకాష్, అరుణ వివాహం సందర్భంగా గురువారం మంత్రి జోగి రమేష్ సీతానగరం విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, న్యూపోర్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిల్‌వాలా సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి -ములగాడ : ప్రముఖ దర్శకుడు వీరభద్రం చౌదరి తెరకెక్కిస్తున్న దిల్ వాలా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను శ్రీహరిపురం, గొల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో చిత్రీకరించారు. హీరో నరేష్ అగస్త్య, హీరోయిన్ శ్వేత నటిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ నటులు రాజేంద్రప్రసాద్, లహరి, ఆలీ రాజా, అవినాష్ నటిస్తున్నారు. నభిషేక్, నరసింహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు అనూప్ సంగీతం అందిస్తున్నారు. మరో వారం రోజులు పాటు విశాఖ పరిసర ప్రాంతాల్లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు దర్శకుడు వీరభద్రం చౌదరి తెలిపారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

జై దుర్గ ఆటోస్టాండ్ డ్రైవర్ల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం బస్టాప్ వద్ద ఉన్న శ్రీ జై దుర్గ ఆటో స్టాండ్ డ్రైవర్ల సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. గౌరవాధ్యక్షులుగా సన్నీయాదవ్, చీఫ్ అడ్వయిజర్‌గా నర్సింగ్, అధ్యక్షులుగా బసవ శ్రీనివాసరావు, కార్యదర్శులుగా దనాల శ్రీనివాసరావు, దుర్గారావు, కోశాధికారిగా నొట్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండేళ్ల నుంచి ఈ ఆటో స్టాండ్ ఎన్నికలు జరగలేదని, అందరినీ ఐక్యం చేసి ఎన్నికలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం వద్ద..

రోడ్డు దాటాలంటే అవస్థలే

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం పరిధి అక్కిరెడ్డిపాలెం- నాతయ్యపాలెం మధ్య జాతీయ రహదారిలో రోడ్డు దాటేందుకు ప్రయాణికులు, స్థానికులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిలో గాజువాక నుంచి ఎన్ఎడి వైపు, ఎన్ఎడి నుంచి గాజువాక వైపు నిరంతరం వాహన రాకపోకలు సాగుతుంటాయి. నిత్య రద్దీగా ఉండే ఈ రహదారిపై రోడ్డును దాటాలంటే ప్రాణభయం తప్పడంలేదు. నాతయ్యపాలెంనకు చెందిన విద్యార్థులు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుతున్నారు. వారంతా ఈ రోడ్డును దాటి పాఠశాలకు వెళ్లాలంటే రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వేగంగా వస్తుంటాయి. ఏ మాత్రం తడబడినా ప్రమాదాలు తప్పడంలేదు. పాఠశాలకు వెళ్లాలంటే నిత్య సాహసం అయిపోతుంది. సమయం కూడా వృథా అవుతోంది. గతంలో ఈ రహదారి దాటుతున్న సమయంలో అక్కిరెడ్డిపాలెంనకు చెందిన రోహిణి ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమైంది. బాలిక సంవత్సరం పాటు కేర్ హాస్పిటల్ చికిత్స పొందింది. ఇక్కడ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పాలకులకు పట్టడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మినీ ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని చెప్పినా ఎటువంటి అడుగూ పడలేదు. కనీసం విశాఖ డెయిరీ సిఎస్ఆర్ నిధుల నుంచి అయినా అండర్ పాత్‌వే నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడి ట్రాఫిక్‌ను, ప్రజలు పడుతున్న ఇబ్బందులను సిపిఎం గాజువాక జోన్ కమిటీ పరిశీలించింది.

విద్యార్థులకు ప్రాణ సంకటం
అండర్ పాత్‌వే నిర్మించాలంటూ డిమాండ్


రహదారిలో భారీ వాహన రాకపోకలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ట్రాఫిక్ ఎక్కువ

అక్కిరెడ్డిపాలెంలో హోటల్ నడుపుతున్నాను. ఈ జాతీయ రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



రమేష్,
అక్కిరెడ్డిపాలెం

భయం.. భయం...

ఈ జాతీయ రహదారిలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు దాటాలంటే భయం. ఏ వాహనం ఢీకొంటుందోనని భయంతోనే రోడ్డు దాటుతున్నాం. పాదచారులకు ప్రత్యేక మార్గం నిర్మించాలి



దాసరి అప్పారావు
అక్కిరెడ్డిపాలెం

అండర్ పాత్‌వే నిర్మించాలి

ఈ రహదారిలో చాలా ప్రమాదాలు చోటుసుకున్నాయి. తీవ్ర గాయాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అండర్ పాత్‌వే నిర్మించాలి. అది కాకుంటే కనీసం సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటుచేసి, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను పెట్టి పాదచారులు సురక్షితంగా రోడ్డు దాటేలా చర్యలు చేపట్టాలి.

ఎం.రాంబాబు,
సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి

సమస్యలపై కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికులకు ఎన్‌జెసిఎస్‌లో వేతనాలు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాల వేతన జిఒను వెంటనే విడుదల చేయాలని, స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సెంట్రల్ స్టోర్స్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఒ.వి.రావు మాట్లాడుతూ, ఐదేళ్లకోసారి వేతన సవరణ జరిగే ప్రక్రియలో జిఒ కాలం పూర్తయినప్పటికీ ఇంకా యాజమాన్యం చేయకపోవడం దుర్మార్గమన్నారు. యాజమాన్యాలు కార్మికులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 12వ తేదీన బొకారోలో జరుగనున్న జాతీయ స్టీల్ కాంట్రాక్టు కార్మికుల కన్వెన్షన్‌లో కాంట్రాక్టు కార్మికులు సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులను చైతన్యం చేసి పోరాటం చేస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కారం కోసం ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరహాలు, కృష్ణ, చట్టి నర్సింగరావు, మసేను, సోమేష్, ఆడారి అప్పారావు, కెపి.నాయుడు, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్స్ పంపిణీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : గిరిజన సంఘం విశాఖపట్నం సిటీ కమిటీ సహకారంతో మారికవలస గురుకుల బాలుర పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు మోడల్ క్వశ్చన్ బ్యాంక్స్‌ను గిరిజన సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కిల్లో సురేంద్ర గురువారం పంపిణీచేశారు. ప్రిన్సిపల్ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, 74 మంది 10వ తరగతి గిరిజన విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రచురితమైన ఈ పుస్తకం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని కోరారు. పాడేరు ఐటిడిఎ గిరిజన సంక్షేమ హాస్టల్ 10వ తరగతి విద్యార్థులకు కూడా అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మోడల్ క్వశ్చన్ బ్యాంక్స్‌ను ఉచితంగా అందించిన గిరిజన సంఘం విశాఖపట్నం సిటీ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సిటీ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.


క్వశ్చన్ బ్యాంక్‌లను పంపిణీచేస్తున్న కిల్లో సురేంద్ర

ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ సిఎం కప్ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి హాజరై మాట్లాడారు. మార్షల్ ఆర్ట్స్ ద్వారా ప్రతి మనిషి దృఢంగా తయారవుతారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్య ఇస్తున్నారని తెలిపారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ, మహిళలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో దాడి రత్నాకర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, చీఫ్ ఆర్గనైజర్ ఎస్‌పిఎండి.నాయుడు పాల్గొన్నారు.

12, 13న ప్రత్యేక ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 12, 13 తేదీల్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కెఎం.ఉన్నికృష్ణన్ నాయర్ రెండు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్‌టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటిస్ (కీళ్ల వ్యాధులు), నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి శిబిరంలో సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలో గల తమ కేంద్రంలో శిబిరం ఉంటుందని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్‌కు 9030568264 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బలవంతపు భూసేకరణ చేస్తే సహించేది లేదు

తహశీల్దారు కార్యాలయం వద్ద రైతు సంఘం, సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-మునగపాక రూరల్

బలవంతపు భూసేకరణకు దిగితే సహించేది లేదని సిపిఎం మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ హెచ్చరించారు. మండలంలోని గ్యాస్ పైప్ లైన్ ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన పరిహారం అందజేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ గ్యాస్ పైప్‌లైన్‌కు రైతుల నుండి ఏపీ జిడిసి సేకరిస్తున్న భూములకు పరిహారం అందజేసే విషయంలో స్పష్టమైన హామీ లేకుండానే భూముల డాక్యుమెంట్లు ఇవ్వాలని రైతులను బెదిరింపులకు, ఒత్తిళ్లకు గురి చేయడం దారుణమన్నారు. రైతుకు సెంటుకు లక్ష రూపాయలు, పంటకు 10 సంవత్సరాల పాటు నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పైప్‌లైన్ వెళ్లే గ్రామాల రైతు కుటుంబాలకు రూ.50 లక్షలు ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చిన తరువాతనే భూముల వద్దకు అడుగు పెట్టాలని బ్రహ్మాజీ స్పష్టం చేశారు. అనంతరం రైతులతో కలిసి ఇన్‌ఛార్జి తహశీల్దార్ వినయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వివి శ్రీనివాసరావు, మునగపాక, తిమ్మరాజుపేట, మూలపేట గ్రామాల రైతులు దొడ్డి నాగభూషణం, ఆడారి సాంబమూర్తి, మల్ల సత్యనారాయణ, బొడ్డేడ వెంకట్రావు, ఆడారి నూకరాజు, మల్ల శివ, మల్ల ప్రసాద్, శరగడం పరదేశిరావు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతు సంఘం, సిపిఎం నాయకులు, రైతులు



నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు

సమస్యలు పరిష్కరించాలి

-102వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాని నేవీ నిర్వాసిత జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని వాడనర్సాపురం నేవీ గేట్ వద్ద నేవల్ బేస్ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 102వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఏసి నాయకులు మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారుల నుండి, ఢిల్లీ డిఫెన్స్ మినిస్టర్ శాఖ అధికారుల వరకు నేవీ ప్రాజెక్టులో తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై అనేక మార్లు అభ్యర్థించినా, వినతిపత్రాలు ఇచ్చినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రోజుకో మాట మాట్లాడి తమని నిరాశపరుస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిది గ్రామాల ప్రజలు నేవీ వలన ఉపాధి కోల్పోతే పట్టించుకోవలసిన అధికారులు ప్రభుత్వాలు, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగునా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలపై జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని పరిష్కరించాలని, లేకుంటే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.



పోస్టాఫీసు పథకాల పుస్తకాన్ని అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులు పొదుపు పథకాల్లో చేరాలి

అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి అచ్యుతాపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొదుపు పథకాలలో విద్యార్థులు పొదుపు చేయాలని అనకాపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్ బాబు అన్నారు. అచ్చుతాపురంలో అచ్యుత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం విద్యార్థులతో ఆయన సమావేశమై మాట్లాడారు. తపాలా శాఖలో ఉన్న పలు పొదుపు పథకాలను ఆయన వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ఆడపిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ పథకంలో చేరడానికి పుట్టినప్పటి నుంచి చేరే అవకాశం ఉందన్నారు. జన్మదిన ధ్రువ పత్రం, ఆధార్ కార్డు, గార్డియన్‌గా ఉన్న తల్లి లేక తండ్రి ఆధార్ కార్డు, పాన్ కార్డు మూడు ఫొటోలు ఉంటే పొదుపు పథకంలో చేరవచ్చని తెలిపారు. గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం, రికరింగ్ డిపాజిట్, టైం డిపాజిట్, కిసాన్ వికాస్ పత్రాలు, నేషనల్ సేవింగ్, సీనియర్ సిటిజన్ పొదుపు పథకాలు, సర్టిఫికెట్లు తదితర పొదుపు పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తపాలా అధికారులు పలాసరావు, అచ్చుతాపురం పోస్టు మాస్టార్ భవాని శంకర్, బిపిఎం విశ్వేశ్వరరావు, అచ్చుతా కళాశాల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్ర బస్సు పున:ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి

ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంవిఆర్ తీర్థయాత్ర బస్సును గురువారం పున:ప్రారంభించారు. ఎంవిఆర్ సతీమణి సూర్య కుమారి, వారి కుమారులు రాజేష్, సతీష్ జెండా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా ఎంవిఆర్ తీర్థయాత్ర బస్సు ద్వారా ఎంతోమంది భక్తులను పుణ్య తీర్థాలకు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ముత్యాల సూర్యకుమారి

ఎన్‌టిపిసి సిఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ప్రారంభించిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సంస్థ జనరల్ మేనేజర్ సిన్హా



భవిత కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్‌టీపీసీ సింహాద్రి సీఎస్ఆర్ నిధులు రూ.55.30 లక్షలతో నిర్మించిన మౌలిక సదుపాయాలను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎన్‌టీపీసీ సింహాద్రి గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా గురువారం ప్రారంభించారు. ముత్యాలమ్మపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ.13.80 లక్షలతో డైనింగ్ హాల్, నాయుడుపాలెం పంచాయతీ పరిధి రాములుగారి దొడ్డి, కోరంగివానిపాలెం వద్ద రూ.22లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఐఇఆర్‌సి భవిత కేంద్రంలో వికలాంగ పిల్లల కోసం రూ.15 లక్షలతో హాల్, మూడు గదులు ఏర్పాటు చేశారు. రూ.1.50 లక్షలతో పేద పిల్లలకు 11 నెంబర్ వీల్ చైర్లు, 10 వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. నాయుడుపాలెం పంచాయతీ సిమ్మంగారి దూది వద్ద రూ.3లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ, ఎన్‌టిపిసి పరవాడ మండలానికి వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతకు మెయింటినెన్స్ ఉద్యోగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎన్‌టీపీసీ యాజమాన్యాన్ని రాబోయే రోజుల్లో ఇదే సహాయాన్ని కొనసాగించాలని కోరారు. ఎన్‌టిపిసి గ్రూప్ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ ఎమ్మెల్యే, సర్పంచ్‌లు గ్రామపెద్దల నుండి దశలవారీగా చేసిన అభ్యర్థనల ఆధారంగా ఎన్‌టిపిసి కచ్చితంగా సాధ్యమయ్యే పనులు చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్, ఎంపీడీవో హేమచంద్రరావు, ఎంఈఓ సునీత, ఈవోఆర్‌డి పద్మజ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ

పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందిన పరవాడలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక సినిమా హాల్ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరవాడ ఎన్‌టిపిసిలో కాంట్రాక్ట్ కార్మికులు 2000 మంది, ఫార్మాసిటీలో 30 వేల మంది, చిన్న తరహా పరిశ్రమల్లో మరో 2000 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అనారోగ్యాలు గురైనప్పుడు కార్మికులు విశాఖపట్నం ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఫార్మాసిటీలో పేలుడు వంటి ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులను విశాఖపట్నం తరలించే లోపు వారి ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని చెప్పారు. పరవాడలో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మిస్తామని గతంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేసిన వాగ్దానాలను నెరవేర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. వేలాది మందితో డబ్బులు కట్టించుకుంటున్న ఈఎస్ఐ కార్పొరేషన్ నుండి ఆసుపత్రి ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కన్నూరు నాయుడు, దోకల జగన్, వి బాబు నాయుడు, పి శ్రీను, ఎం అప్పారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.


కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలో మోసయ్యపేట గ్రామ పంచాయితీలో గడప-గడపకు మన ప్రభుత్వ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న కాలువ పనులను గురువారం ఎంపిడిఒ కొంకి అప్పారావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిస్కా రాజేశ్వరి, కార్యదర్శి మహేష్, సూపరింటెండెంట్ ఖాన్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి, సరిహద్దులు గుర్తించాలని వినతి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని అసకపల్లి పంచాయతీ పరిధిలో చెరువుల ఆక్రమణలు తొలగించి, సరిహద్దులను గుర్తించాలని అసకపల్లి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక తహసీల్దార్ బి.సత్యనారాయణకు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్16 లో ఎర్ర చెరువు ఇటీవల ఆక్రమణకు గురైందని, ఆ ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ ఆక్రమణలు తొలగించేందుకు వెళ్ళిన రెవెన్యూ సిబ్బందిపై సర్పంచ్‌తో పాటు ఆక్రమణదారులు తిరుగుబాటుకు దిగి దాడి చేసేందుకు ప్రయత్నించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అసకపల్లి పంచాయితీ పరిధిలోని ఎనిమిది చెరువులలో ఉన్న ఆక్రమణలు తొలగించి, సరిహద్దులను గుర్తించాలని కోరారు. సర్పంచ్ తన అనుచరులతో అసకపల్లి సర్వే నెంబర్ 1లో స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా అమ్మకాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే ఈ కబ్జాలపై దర్యాప్తు చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, మాజీ ఉప సర్పంచ్ మొల్లి చిన్నారావు, ఉప సర్పంచ్ కరణం సురేష్, వార్డు సభ్యులు కర్రి హరికృష్ణ, పంచదార్ల దేముడమ్మ రమణ, సాలాపు శ్రీను గ్రామస్తులు ధూళి నరేష్, నక్క తాతారావు, డి.నారాయణరావు, దువ్వ దుర్గాలు, గంతకోరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అసకపల్లి గ్రామస్తులు

విస్సన్నపేట భూములపై న్యాయ విచారణ చేపట్టాలి



నాగులాపల్లి సత్యనారాయణతో మాట్లాడుతున్న గంటా

నాగులాపల్లికి మాజీ మంత్రి గంటా పరామర్శ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని రాజాం మాజీ సర్పంచ్, వ్యవసాయ కూలీ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి నాగులాపల్లి సత్యనారాయణను మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం రాజాం గ్రామంలో పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటున్న నాగులాపల్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోరుకొండ రవికుమార్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ డొంకిన అప్పలనాయుడు, మాజీ ఎంపిటిసి మరిసా సతీష్, మరిసా నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి తీర్థం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎఎస్.పేట గ్రామంలో ఆంజనేయ స్వామి తీర్థం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్ళా రమకుమారి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. సాయంత్రం ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. గమొదటి బహుమతి రూ.12 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాలుగు బహుమతి రూ.6 వేలు, ఐదవ బహుమతి రూ.4 వేలు అందజేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ, మలసాల భరత్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ మలసాల కుమార్ రాజా పాల్గొన్నారు.

సంపత్ వినాయక తీర్థ మహోత్సవం

సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయితీ శివారు గణపతి నగర్ గ్రామంలో సంపత్ వినాయక తీర్థ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బిసి సెల్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి రేసుపూడి రమణ దంపతులు సంపత్ వినాయక స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం నుండి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వార్డు సభ్యులు కర్రి శ్రీనివాసరావు, బలిరెడ్డి ఉమ, కర్రి అప్పల నాయుడు, బలిరెడ్డి బంగారు నాయుడు, కర్రి గోవింద్, ఆర్.బంగారు నాయుడు, సంపత్ వినాయక యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'కైట్స్'లో ఆధార్ సేవలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం కైట్స్ జూనియర్ కళాశాలలో గురువారం ఆధార్ నమోదు సేవా కార్యక్రమాన్ని డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్ మంజులవాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల జన్మదిన తేదీలు, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లు తదితర సవరణలు చేసుకోవడానికి ఈ నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులకు సమయంలో వృథా కాకుండా కళాశాలలోనే ఈ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, మండల పరిషత్ పరిపాలన అధికారి డి.కృష్ణ, కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, ప్రిన్సిపాళ్లు ఆడారి అప్పలనాయుడు, ఆడారి సన్యాసినాయుడు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎస్.వినీత పాల్గొన్నారు.

నూకరాజుకు ఘన సత్కారం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఆ గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజును సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఘనంగా సత్కరించారు. మూడు పర్యాయాలు వరుసుగా సర్పంచిగా ఎన్నికైన ఆయన మూడో దఫా పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సత్కారం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొంది గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని వారు కోరారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. తనను నమ్మి సర్పంచ్‌గా మూడు పర్యాయాలు గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు.

భూములను పరిశీలించిన జనసేన నాయకులు



విస్సన్నపేట భూముల వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట మండలం, విస్సన్నపేట సర్వే నెంబర్ 195/2లో సుమారు 609 ఎకరాల ప్రభుత్వ భూమి, దళితులకు ఇచ్చిన ఎస్ఎన్ ల్యాండ్, సీలింగ్ ల్యాండ్ భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఆక్రమణ గురైనట్లు ఆరోపిస్తున్న భూములను గురువారం జనసేన నాయకులు పరిశీలించారు. అమర్నాథ్ డౌన్ డౌన్, భూ బకాసురుడు అమర్నాథ్ అంటూ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు టి.శివశంకర్, కోన తాతారావు, పరుచూరి భాస్కరరావు, సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ 609 ఎకరాలు ఆక్రమణకు గురైందని నిరూపిస్తే రాసి ఇస్తానని సవాల్ చేస్తున్న మంత్రి, దానిపై చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూలం గోపి, శ్రీరామదాసు గోవిందా, రామకృష్ణ, తాడి రామకృష్ణ, మల్ల శ్రీను, బర్నికాన రాము, జగదీష్, బొలిశెట్టి సందీప్, శ్రీదేవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సెంటు భూమి ఉన్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

అనకాపల్లి : విస్సన్నపేట భూముల్లో మంత్రి అమర్నాథ్‌కు సెంటు భూమైనా ఉన్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తామని ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట జడ్పిటిసి సభ్యులు దంతులూరి శ్రీధర్ రాజు ప్రకటించారు. స్థానిక విజయ రెసిడెన్సీలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనసేన నిజ నిర్ధారణ కమిటీ పేరుతో హడావుడిగా విస్సన్నపేట భూములను పరిశీలించిందని, అక్కడ వాస్తవ సాగుదారులే ఉన్నా, భూమి కబ్జా అయినట్లు జనసేన నాయకులు అవాస్తవాలు మాట్లాడుతున్నారని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం తమ నాయకుడు అమర్నాథ్ మీద బురద చల్లితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, వైసీపీ నాయకులు పలక రవి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, కొణతాల మురళి కృష్ణ పాల్గొన్నారు.

జన్యు మార్పిడి టెక్నాలజీని నిషేధించాలని వినతి



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆహార పంటల్లో జన్యు మార్పిడి టెక్నాలజీని నిషేధించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సురక్షిత ఆహార దినోత్సవం పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ఆహార పంటల ఉత్పత్తిలో జన్యు మార్పిడి సాంకేతికతను చొప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను, తాజాగా ఆవాలలో జన్యు మార్పిడిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో ఈ అంశంపై కేసు నడుస్తున్నప్పటికీ కేంద్రం హడావుడిగా ఈ పంటను క్షేత్రస్థాయిలో పరిశోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తనాలను సరఫరా చేసిందని తెలిపారు. 10 సంవత్సరాల కిందటే జన్యు మార్పిడి విత్తనాలు, కలుపును తట్టుకునే టెక్నాలజీపై సుప్రీంకోర్టు టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్ కమిటీ చేసిన హెచ్చరికలను కేంద్రం పెడచెవిన పెట్టిందని పేర్కొన్నారు. బహుళ జాతి సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకే కేంద్రం ఈ చర్యలకు పూనుకుంటుందని విమర్శించారు. దీనికి వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, రైతు సంఘాల ప్రతినిధులు కొల్లి సత్యారావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణతో ఉపాధికి దెబ్బ

ప్రజాశక్తి - కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉన్నందునే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, బిసిలతో పాటు అన్ని తరగతుల వారికీ ఉద్యోగాలు లభించాయని సిఐటియు మల్కాపురం జోన్ కార్యదర్శి పూడి పైడిరాజు అన్నారు. ఇదే కర్మాగారం ప్రైవేట్ కార్పొరేట్ చేతుల్లోకి వెళితే రిజర్వేషన్లు ఉండవని, అదే జరిగితే అన్ని సామాజిక తరగతుల వారికీ ఉపాధి దొరకదని అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 679వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మల్కాపురం జోన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఆ ప్రతిపాదనను రద్దు చేయాలన్నారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో ఎస్.లోకేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, పి.సురేష్, ఎం.ప్రేమ్ కుమార్, ఎస్‌కె.సుభాన్ ఉన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

భూముల రీ సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (రీ సర్వే) పనులను వేగవంతం చేయాలని సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. భూములకు సంబంధించిన పలు అంశాలపై విజయవాడ నుంచి గురువారం ఉదయం ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, సర్వే విభాగం సహాయ సంచాలకులు ఆర్.విజయ్ కుమార్, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ పాల్గొన్నారు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 11న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డిఈఈ ఎస్.రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టణంలోని రింగ్ రోడ్డు, గాంధీ బొమ్మ సెంటర్, పెరుగు బజార్ చిన్న వీధి, నెయ్యిల వీధి చేపల మార్కెట్ ప్రాంతాల్లో తుప్పు పట్టిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పు కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

పేదలకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : రాష్ట్రంలో పేదలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. గురువారం చౌడువాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడువాడ నుండి జుత్తాడ వరకు 50 లక్షలతో తారు రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ జడ్పిటిసి ఈర్లే అనురాధ, స్థానిక నాయకులు శివాజీ రాజు, రాజేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని బొట్టవానిపాలెం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్‌తో పాటు ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పల రాజు, వైసిపి నాయకులు చుక్కా రామునాయుడు, కోన రామారావు, బురద రాజు, బొద్దపు చిన్నారావు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కశింకోట : మండలం, మోసయ్య పేట గ్రామంలో మరిడి మాంబ అమ్మవారి పండుగ సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.త ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలాజీ, కాయల మురళి, మళ్ళ సురేంద్ర, నైనం శెట్టి రమణారావు, వేగి గోపీకృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, దుద్దేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ఆకాష్ బైజూస్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జెఇఇ మెయిన్స్ - 2023 మొదటి సెషన్‌లో వైజాగ్‌కు చెందిన ఆకాష్ బైజూస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు 99 పర్సంటైల్ మించి సాధించారని ఆ విద్యా సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది జరగాల్సిన రెండు ఇంజినీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్షల్లో ఇదే మొదటిదని అన్నారు. తమ విద్యార్థులు కాకరపర్తి శ్రీరామ శ్రీకర్ 98.49 పర్సంటైల్, డి.మణిదీప్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. ఈ మేరకు గురువారం ఆకాష్ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందిస్తూ ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ కుమార్ మిశ్రా మాట్లాడారు. ఆకాష్ బైజూస్ హైస్కూల్, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులకు బహుళ కోర్సు ఫార్మాట్లలో ఐఐటి, జెఇఇ శిక్షణను అందిస్తోందన్నారు.

హెటిరో పర్యావరణ నిబంధనలు ఉల్లంఘన

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు - కొనసాగిన మత్స్యకారుల మహా ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ పరిశ్రమ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తే అధికారులు చోద్యం చూస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు విమర్శించారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నాలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెటిరో డ్రగ్స్ కంపెనీ ఏర్పాటు చేసిన దగ్గర నుండి చట్టాలను ఉల్లంఘించి లెక్కలేని తనంగా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి డీశాలినేషన్ ప్లాంట్‌ను హెటిరో కంపెనీ నిర్మించుకున్నప్పటికీ పర్యావరణ, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. చర్యలు చేపట్టవలసిన అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెటిరో డ్రగ్స్ రెండవ పైపు లైన్‌కు వ్యతిరేకంగా ఓ వైపు మత్స్యకారులు పోరాడుతూ మరో వైపు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో న్యాయ పోరాటాం చేస్తున్నారని తెలిపారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కోర్టులో కేసు విచారణలో ఉండగా కేంద్ర పర్యావరణ అటవీ, మంత్రిత్వ శాఖ ఏ విధంగా అనుమతులు ఇచ్చిందని, ఇది పూర్తిగా చట్టం ఉల్లంఘనే అవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెటిరో యాజమాన్యంతో కుమ్మక్కై మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారని అర్థమవుతుందన్నారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.త్రినాధరావు, మండల కమిటీ సభ్యులు ఎం.మహేష్‌బాబు, విద్యార్థి విభాగం కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, మత్స్యకార నాయకులు పిక్కి రమణ, కోడా కాశీరావు, చేపలు సోమేష్, మైలపల్లి లోవరాజు, మైలపల్లి బాబ్జీ, చోడిపల్లి రాజు, కాశీ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు


ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆధార్ క్యాంపు పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో గురువారం ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసారు. ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపిపి వీసం నానాజీ ఆధార్ క్యాంపును పరిశీలించారు. విద్యార్థు లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆధార్ అప్డేట్ ను సకాలంలో పూర్తి చేయాలని ఆధార్ క్యాంప్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల ఆధార్ అప్డేట్, మార్పులు, చేర్పులు చేపట్టడం కోసం విద్యా కేంద్రాల్లో ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ నాగకార్తీక్

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

- ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట గ్రామంలో గౌరీ పరమేశ్వర ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమ య్యాయి. పండుగ నేపథ్యంలో గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్సై నాగకార్తీక్ ప్రారంభించారు. ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

సంపద సృష్టి ఇలాగేనా?

కేంద్రంలో చెత్తను తగలబెడుతున్న వైనం

ప్రజాశక్తి- కోటవురట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామ గ్రామాన నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు దాదాపు కొన్ని గ్రామాలలో వృథాగానే దర్శనమిస్తున్నాయి. గురువారం ప్రజాశక్తి పరిశీలనలో ఎండపల్లి గ్రామం వద్ద సంపద సృష్టి కేంద్రం లో చెత్తను తగలబెడుతున్న దృశ్యం కెమెరాకు కంట పడింది. సంపద సృష్టి పక్కనపెడితే కేంద్రంలో తగలబెడుతున్న చెత్తతో వచ్చే కాలుష్యం అధికంగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లోకి వచ్చే వాయు కాలుష్యంతో ఊపిరితిత్తులు, కళ్ళు దెబ్బతినే ప్రమాదం ఉందని, అంతేకాకుండా ఈ కేంద్రం ప్రధాన రహదారిని ఆనుకొని ఉండటంతో కొన్ని సందర్భాలలో పొగ కారణంగా ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గ్రామాలలో కేంద్రాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ ఉండగా కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా పడి ఉన్నాయి. జిల్లా పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ప్రకటనలను గుప్పించి వెళ్లి పోతున్నారే తప్పా వాటిని అందుబాటులోకి తీసుకు వచ్చిన దాఖలాలు ఎక్కడా కానరాలేదు. కొన్ని చోట్ల లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ కేంద్రాలు నిరుపయోగంగా ఉండటం గమనార్హం.


కేంద్రంలో తగలబెడుతున్న చెత్త

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి గురువారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. రాంబిల్లి మండలం కోప్పగుండుపాలెంకు చెందిన బద్ది శ్రీనివాసరావు (37) శంకవరం మండలం మండపం గ్రామంలో ఉపాధి నిమిత్తం భార్య పిల్లలతో అక్కడికి వెళ్లి నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా నక్కపల్లి మండలం గొడిచర్ల సమీపానికి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ స్తంభాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. తుని ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు.

క్షతగాత్రునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మాడుగుల: ప్రమాదంలో వికలాంగుడైన బాధితునికి ఆర్థిక సహాయం అందజేశారు. మాడుగుల గ్రామానికి చెందిన రాళ్లపూడి శ్రీనివాసరావు ఇటీవల ధాన్యం నూర్పు యంత్రం దగ్గర పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలికి తీవ్ర గాయం కావడంతో తొలగించారు. నూర్పు యంత్రం యజమాని కర్రి సీతారాం బాధితునికి లక్షా 50 వేల ఆర్థిక సహాయం గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెదబాబు, తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భీముని జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.


నగదు పంపిణీ చేస్తున్న నాయకులు


ప్రారంభించని సచివాలయం

ప్రారంభానికి నోచని సచివాలయం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామానికి సంబంధించి ప్రభుత్వం నిర్మించిన గ్రామ సచివాలయం ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రజలు, సిబ్బంది తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దాదాపు నిర్మాణం పూర్తయి ఆరు నెలలు పూర్తి కావచ్చింది. ప్రస్తుతం సచివాలయం సమీపంలో గల షాపింగ్ కాంప్లెక్స్ వద్ద అదె కొంపలో కొనసాగుతూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వాలంటీర్లు సమీపంలోని కళామందిరంలో సేవలు అ ందిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సచివాలయం ప్రారంభానికి చర్యలు చేపట్టి గ్రామస్తులకు, సిబ్బందికి అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.


పనులు పరిశీలిస్తున్న జెఇ

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: మండలంలోని అమలాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పథకాన్ని నర్సీపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ మల్లేశ్వరి పరిశీలించారు. ప్రతి ఇంటికి కుళాయి ఇచ్చే విధంగా చూడాలని, ఎక్కడా కూడా నీరు వృధా కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీరు సక్రమంగా వస్తున్నది లేనిదో ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వాడాలన్నారు. నీరు ఎంత పొదుపుగా వాడితే భావితరాలకు అంతగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. విడబ్ల్యూఎస్సి కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు ఈ పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుమా, గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా అందరికి నీరు అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రమణ, వార్డు మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ముస్తాబైన ఆలయం

ఆలయ వార్షికోత్సవ ఏర్పాట్లు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక గ్రామంలో దుర్గాదేవి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ తెలిపారు. ప్రతీ ఏటా ఫిబ్రవరి 10, 11 తేదీల్లో అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తామని, దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఏకాహం (భజన) శ్రీనివాసా భజన భక్త సమాజం ఆధ్వర్యంలో జరుగుతుందని, శనివారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తుల దర్శనాలు, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి లచ్చబాబు పాల్గొన్నారు.

పథకాలపై చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (విశాఖ) ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఈనెల 7 నుంచి 8 వరకు నిర్వహించిన ఫొటో ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ఈ బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం నుంచి సివిల్స్ కు ఎంపికై జాతీయ స్థాయిలో 28వ ర్యాంక్ సాధించిన మౌర్య భరద్వాజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల విజేతలకు ముఖ్యఅతిధులు బహుమతులు అందజేశారు.ఆజాద్ కా అమృత మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల ప్రదర్శనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు.పొటో ప్రదర్శనలో కరోనా వ్యాక్సినేషన్, కోవిడ్, స్వచ్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, ఏక్ భారత్ శ్రేష్ భారత్, మహాత్మగాంధీ ఉపాధి హామీ పథకం వంటి కేంద్ర ప్రభుత్వ, వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ గౌరీ, పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్:ఈ నెల 12 నుంచి 16 వరకు హర్యానాలోని జరిగే ఫస్ట్ ఖేల్ ఇండియా నేషనల్ బాక్సింగ్ అండర్ 14 విభాగంలో నింజాస్ అకాడమీకి చెందిన ముగ్గురు బాక్సర్లు పాల్గొననున్నారు. వీరిలో ఎం.లాస్య (34 కేజీల విభాగం), జి.జ్యోతి (42 కేజీల విభాగం), కె.హర్షిత (65 కేజీల విభాగం)లో ఆడనున్నారు. ఈ నెల 9న వీరంతా హర్యానా వెళ్లనున్నారు. ఈ మేరకు వీరిని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్ చైర్ పర్శన్ గుడబండి ఆదిలక్ష్మి అభినందించారు. పతకాలు సాధించి నర్సీపట్నంకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్టేట్ స్కూల్ గేమ్స్‌లో రాణించిన బొంతు మౌనికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో శాప్ కోచ్ అబ్బు, కోచ్ శేఖర్ పాల్గొన్నారు.



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజు

రజక సంఘం సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో గురువారం రజక సంఘం కమ్యూనిటీ భవనంను మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు ఎన్నాళ్ల నుంచో కమ్యూనిటీ హాలు పూర్తి చేయాలని కోరడంతో స్థానిక పంచాయతీ నిధుల నుండి 15వ ఆర్థిక సంఘం నిధులతో ఉప సర్పంచ్ సుర్ల నరసింహమూర్తి, ఎంపిటిసి సుర్ల కృష్ణ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం గౌరమ్మ ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ 'బ్లాక్ డే'

-మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్



అనకాపల్లిలో మాట్లాడుతున్న బాలకృష్ణ

కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన రైతు వ్యతిరేక బడ్జెట్‌పై రైతు, ప్రజా సంఘాలు బ్లాక్ డే పాటించాయి. కేంద్ర బడ్జెట్ రైతాంగానికి ఉరితాడు వంటిదని, రైతులు, కూలీలకు అనుకూలంగా దీనిని తిరగరాయాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.


ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయం సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకోవాల్సింది పోయి ఎరువుల ధరలపై రూ.50 వేల కోట్లు పెంచడం దారుణమన్నారు. రైతు సంఘాల జిల్లా కన్వీనర్ పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ రైతు కూలీలకు ఉపాధి కల్పిస్తూ, భూగర్భ జలాల పెంపుకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా దానికి రూ.30 వేల కోట్లు కోత విధించడం దుర్మార్గమన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు కే శంకర్రావు, వైఎన్ భద్రం, కిసాన్ కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, కొండలరావు, వ్యవసాయదారుల సంఘం భీశెట్టి కృష్ణ అప్పారావు, ఆమ్ ఆద్మీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు బాలు గాడి మాట్లాడుతూ కేంద్ర ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ఆమోదిస్తే రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు పెరుగుతాయని తెలిపారు. రైతు సంఘాల నాయకులు ఏడుకొండలు, కాళ్ళ తేలయ్య బాబు, బాలాజీ, సిఐటియు నాయకులు చలపతి పాల్గొన్నారు.



మునగపాకలో..

మునగపాక రూరల్ : బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని, రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక మెయిన్ రోడ్‌లో బ్లాక్ డేలో భాగంగా రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఢిల్లీ రైతు ఉద్యమం నేపథ్యంలో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసినట్లుగా ప్రకటించిన మోడీ ప్రభుత్వం వాటిని దొడ్డిదారిన అమలు చేసే ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. సిఐటియు మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ, రైతు నాయకులు మళ్ల సాంబమూర్తి, ఆడారి శ్రీరాముడు, శరగడం మహాలక్ష్మి నాయుడు, దొడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో వినతిపత్రం ఇస్తున్న నేతలు

కె.కోటపాడు : దేశవ్యాప్త బ్లాక్ డే కార్యక్రమాలు భాగంగా మండలంలోని ఏ కోడూరు గ్రామంలో గురువారం రైతు సంఘం, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో రాస్తారోకో నిరసించారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ప్రజాసంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు మాట్లాడుతూ రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా దళారులకు దోచుపెట్టి ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, వేమల చిట్టిబాబు, రొంగలి గోపి, దేవుడి నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- నక్కపల్లి:కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి, కూలీలు, కార్మికులకు కేటాయింపులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం తహాశీల్దార్ కార్యాలయం ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ అశోక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం 2023 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిందని, దానికి అనుగుణంగా బడ్జెట్‌లో ఏ మాత్రం కేటాయింపులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇస్తున్న ఎరువుల సబ్సిడీలకు కేటాయింపులు తగ్గించారన్నారు.రైతులను వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడానికి ఏ విధమైన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.త్రినాధ్‌రావు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కె.కోటపాడులో..

వినూత్న నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు, కూలీలకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భవాని తెలిపారు. గురువారం మండలంలోని ఒమ్మలి గ్రామంలో చెరుకు రైతులు, కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడ్జెట్లో వ్యవసాయ రంగానికి మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎరువుల పై 50 వేల కోట్లు, ఉపాధి రంగంపై 30 వేల కోట్లు కోత విధించిందన్నారు. ఈ కారణంగా రైతుల ఆత్మ హత్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే గత ఏడాది నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.16 వేల కోట్ల నిధులు చెల్లించవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు.



మాడుగులలో చెరుకు మోస్తూ నిరసన

కూలి కోసం వెళ్లి.. విగతజీవులై..

-జి.రాగంపేటలోని అంబటి ఆయిల్ పరిశ్రమలో ప్రమాదం
-ఊపిరాడక ఐదుగురు అల్లూరి జిల్లా వాసులు మృతి
-పర్రెడ, బొండాపల్లి పంచాయతీల్లో విషాదఛాయలు



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - పెదబయలు:వారంతా గిరి పేదలు.. ఉపాధి కోసం పొట్టచేతపట్టుకుని వేరే జిల్లాకు ఈ మధ్యనే వెళ్లారు. పట్టుమని పది రోజులు గడవక ముందే వారిళ్లలో తీవ్ర విషాదం. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు గురువారం మృతిచెందగా వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లా, పెదబయలు మండలానికి చెందిన వారే ఐదుగురు ఉన్నారు. దీంతో వారి స్వస్థలాలైన పర్రెడ, బొండాపల్లి ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల్లో వెచ్చంగి కృష్ణ (35), వెచ్చంగి నరసింహ (38), వెచ్చంగి సాగర్(20), కుర్తాడి బొంజుబాబు (26), కొర్ర రామారావు(43) ఉన్నారు. వీరిలో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందినవారు.

కూలి పనుల కోసం వెళ్లి..

పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామం నుంచి వెచ్చంగి కృష్ణారావు, వెచ్చంగి నరసింహ, వెచ్చంగి సాగర్ ఇదే పంచాయతీలోని వంచెడిపుట్టు గ్రామ నివాసి కుర్తాడి బొంజుబాబు, బొండాపల్లి పంచాయతీ, ఈదులమెట్ట గ్రామ నివాసి కొర్ర రామారావు కూలి పనుల కోసం పది రోజులు క్రితం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటకు వెళ్లారు. అక్కడి ఆయిల్ కంపెనీలో పనికి కుదిరారు. ఇక ఎంతో కొంత కూలి డబ్బులు వస్తాయని, వాటితో జీవనం సాగించొచ్చని వారి కుటుంబీకులు అనుకున్నారు. ఇంతలోనే పెద్ద కుదుపు. ఫ్యాక్టరీలోని ఐదో నెంబరు ఆయిల్ ట్యాంకును శుభ్రం చేసేందుకు దిగి వారు ఊపిరాడక చనిపోయారన్న విషాద వార్త. దీంతో వారివారి స్వస్థలాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబీకులను గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు.



విలపిస్తున్న మహిళ

ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ

మృతుల్లో ఈదులమెట్ట గ్రామస్తుడు కొర్ర రామారావుకు భార్య, ఎనిమిది మంది సంతానం. వెచ్చంగి నరసింహకు భార్య, నలుగురు పిల్లలు, కృష్ణారావుకు భార్య ఐదుగురు సంతానం. వెచ్చంగి సాగర్‌కు ఇంకా వివాహం కాలేదు. మృతుల్లో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో ఆ కుటుంబీకుల రోధనలు మిన్నంటాయి. కృష్ణారావు కుమార్తె పవిత్ర విశాఖపట్నంలో నర్సింగ్ కోర్సు చదువుతోంది. ఆమెకు ఫీజు కట్టేందుకు డబ్బులు కూడబెట్టేందుకు కృష్ణారావు కూలి పనులకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మిగతా వారూ ఆర్థిక కష్టాల నుంచి బయటపడేందుకే వలసలు వెళ్లారు.

పలువురు పరామర్శ

మృతుల కుటుంబీకులను గిరిజన సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, సిఐటియు మండల కార్యదర్శి కె.శరభన్న తదితరులు పరామర్శించారు. గిరిజనులు పండిస్తున్న వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర దక్కక పలువురు వలసలు పోతున్నారని, కొందరు అక్కడే తనువు చాలిస్తున్నారని తెలిపారు.